క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


ప్యాడ్లు, పెన్నులను అందజేస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నగరపాలక ఉన్నత పాఠశాలలో 2005–2006 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు గురువారం ఆ పాఠశాలలో కలిశారు. ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. నాటి తీపి గుర్తులను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి పూలబాటలు వేసిన తమ గురువులు ఆనంద్‌కుమార్, మునిశారద, రెడ్డప్పరెడ్డి, శాంతికళ, చంద్రశేఖర్, గీత, రాజేంద్రరెడ్డిని సత్కరించుకున్నారు. తమ వంతుగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షకు అవసరమైన రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు సామగ్రిని అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మునిశేఖర్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి


మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ జాతీయ నేత గిరిధర్ మాదిగ

తిరుపతి కల్చరల్: మాదిగలకు రిజర్వేషన్ కల్పిస్తామని ప్రధాని హోదాలో కరీంనగర్ సభలో ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు కల్పించి నరేంద్రమోదీ మాట నిలుపుకోవాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.గిరిధర్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ వారి ప్రయోజనాలను విస్మరించి రాజకీయ పార్టీలు దగా చేస్తున్నాయని వాపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి సీట్లు కేటాయింపు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 29 రిజర్వుడు స్థానాల్లో 14 స్థానాలు మాదిగలకు కేటాయించాలన్నారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నేతలు మురళి, హేమ, ప్రశాంతి, వినోద్‌కుమార్, సుధాకర్, రమాకాంత్ పాల్గొన్నారు.

16న పొట్టి శ్రీరాములు జయంతి

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వం ప్రకటించిన మేరకు రాష్ట్రపండుగ అయిన అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలను టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ప్రత్యేక అతిథులుగా జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీ ముఖ్య భద్రతాధికారి డి.నరసింహ కిషోర్, ముఖ్య వక్తగా తిరుమల మ్యూజియం అధికారి డాక్టర్ నాగోలు కృష్ణారెడ్డి హాజరు కానున్నారు. రాష్ట్రానికి చెందిన భారత స్వాతంత్య్ర సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ఆత్మత్యాగం చేసి అమరజీవిగా కీర్తించారు.

శ్రీవారి సేవలో గోల్డ్ మ్యాన్


తిరుమల ఆలయం వెలుపల గోల్డ్‌మ్యాన్

తిరుమల: తిరుమల వేంకటేశ్వర స్వామివారిని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ (బంగారు బాబు) బుధవారం ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో ప్రతిరోజు తమ ఫౌండేషన్ ద్వారా వందలాది మంది భక్తులకు దర్శన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో రానున్న రోజుల్లో తమ ఫౌండేషన్ ద్వారా వేలాదిమందికి దర్శనం కల్పించే అవకాశం కల్పించాలని స్వామివారిని కోరుకున్నట్లు చెప్పారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామివారి ఆశీస్సులతో ప్రతి శనివారం వందలాది మందికి అన్న సమర్పణతో పాటు, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. స్వామివారి దీవెనలతో ఎలాంటి విరాళాలు సేకరించకుండా సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఫౌండేషన్ సభ్యులు గాలి కృష్ణ, రవి కుమార్, కిరణ్, మారం ప్రసాద్ ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,832 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,636 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


విశ్వబ్రాహ్మణుల సంఘం చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

సోషల్ మీడియాలో వేధింపులు దుర్మార్గం

- అందుకే గీతాంజలి బలవన్మరణానికి పాల్పడింది
- సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడే వారికి కనువిప్పు కావాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- గీతాంజలికి నివాళులు అర్పించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

చంద్రగిరి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు చాలా వరకు తన కుటుంబానికి వర్తించాయని, తన కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నెరవేరిందని తెనాలికి చెందిన గీతాంజలి సంతోషంగా చెప్పడమే ఆమె పాలిట శాపంగా మారిందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. గీతాంజలి బలవన్మరణంతో అయినా సోషల్ మీడియా వేదికగా వేధింపులకు పాల్పడే వారికి కనువిప్పు కావాలన్నారు. మంచిని ప్రచారం చేసుకునేందుకు వినియోగించాల్సిన సోషల్ మీడియాను అభంశుభం తెలియని అమాయకురాలు ప్రాణాలను తీసుకునే విధంగా ట్రోల్స్ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. గురువారం విశ్వ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద గీతాంజలి మృతి పట్ల ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి సంఘీభావం అక్కడకు చేరుకున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆమె చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై, గీతాంజలి మృతికి కారకులైన రాక్షసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్నను మళ్లీ గెలిపించుకుంటామని చెప్పడమే గీతాంజలి చేసిన తప్పా ? అని ప్రశ్నించారు. ఇటీవల ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సోషల్ మీడియాలో సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారన్నారు. తనకు ఇంటి స్థలం ఇచ్చారని, ఎంతో సంతోషంగా ఉందని, అమ్మఒడి, పింఛన్, వైఎస్సార్ చేయూత వంటి మరెన్నో పథకాలు వచ్చాయని తెలిపారు. ఆమె సంతోషాన్ని చూసి ఓర్వలేని కొందరు సోషల్ మీడియాలో వికృతంగా వ్యవహరించి ఆమె బలవన్మరణానికి కారకులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రజలకు మెరుగైన పథకాలు, అభివృద్ధి, సంక్షేమం అందుతుందా ? అని పర్యవేక్షించాల్సిన ప్రతిపక్ష పార్టీలు నేడు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుండడం దురదృష్టకరమని విమర్శించారు. ఆమెపై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వీరి పైశాచిక ఆనందానికి, నిరంకుశ ధోరణికి ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోయి ఒంటరిగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెట్టిన పోస్టింగులు, ఆ ట్రోలింగ్‌లు చూసి గీతాంజలి తట్టుకోలేక విలవిల్లాడి ఉంటుందన్నారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లం చంద్రమౌళి రెడ్డి, తిరుపతి రూరల్ మండలం వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు బాలాచారి, కుమార్, నటరాజ, నాదముని, మిథిలేష్, భాను, పెద్దఎత్తున నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ

- జపాన్‌లో రూ.లక్షల జీతంతో ఉద్యోగాలు
- నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, న్యువిస్ హెచ్‌ఆర్ సంయుక్తంగా ఏఎస్‌ఎం, జీఎన్‌ఎం, నర్సింగ్ విద్యార్హత కలిగిన 32ఏళ్ల లోపు యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ జపనీస్ భాషతోపాటు ఉద్యోగాలు పొందడానికి అవసరమైన నైపుణ్యతను అందిస్తారని పేర్కొన్నారు. బెంగళూరు నగరంలోని న్యువిస్ హెచ్ ఆర్ వారి కార్యాలయంలో ఆరు నెలలపాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు . అయితే శిక్షణకు రూ.3.50లక్షలు చెల్లించాలని చెప్పారు. తొలి విడతగా 50వేలు కట్టాలని..అందులో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25 వేలు చెల్లిస్తుందని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని మూడు విడతలుగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.శిక్షణ అనంతరం రూ.లక్ష నుంచి రూ.1.40లక్షల మేరకు జీతాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్ హోమ్ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9988853335, 8801346518, 9441993732 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే


12వ డివిజన్ సచివాలయంలో ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు

తిరుపతి కల్చరల్: ఇచ్చిన మాట మేరకు పేద మహిళలకు సొంతింటి కల నెరవేర్చిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు తెలిపారు. 12వ డివిజన్ సచివాలయంలో గురువారం మహిళలకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజాసంక్షేమాన్ని కాంక్షించిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పేద పిల్లలకు సైతం ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య, ఇంగ్లిషు మీడియం అందిస్తూ వారి కలలు సాకారం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి పేదవాడికి ఖరీదైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ ద్వారా సుమారు 35 వేల వ్యాధులను చేరుస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో తిరుపతిలోని 26 వేలమంది పేద మహిళలకు ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి వారి తాళాలు అందించనున్నారని తెలిపారు. గత 40 ఏళ్లలో ఎన్నడూ జరగని రీతిలో తిరుపతి అభివృద్ధికి శ్రమిస్తూ మాస్టర్‌ప్లాన్ రోడ్లతో నగరాన్ని అత్యంత సుందర నగరంగా తీర్చిదిద్దుతూ డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వలంటీర్లను శాలువలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు హరినాథరెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి, నల్లానిబాబు, వినోద్ రాయల్, చరణ్, మహ్మద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనసైనికులపై టీడీపీ నేతల దాడి

- జనసేన కార్యాలయం ముందు టీడీపీ శ్రేణుల వీరంగం
- టపాకాయలు పేల్చి పెద్ద ఎత్తున నినాదాలు
- ప్రశ్నించడంతో జనసేన కార్యకర్తలను కొట్టి పరారీ
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు


జనసేన కార్యాలయం వద్ద బాధితులతో మాట్లాడుతున్న జనసేన నాయకుడు చంద్రశేఖర్

రేణిగుంట(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి జనసేన కార్యాలయం ముందు గురువారం రాత్రి టీడీపీ శ్రేణులు వీరంగం చేశాయి. టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు శ్రీకాళహస్తి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఆ తర్వాత కొందరు పట్టణంలోని కోర్టు సమీపంలోని గోపాలవనం నాయుడు బిల్డింగ్స్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయం వద్దకు మోటార్ సైకిళ్లపై వెళ్లి అక్కడ జై బొజ్జల సుధీర్‌రెడ్డి.. అంటూ గట్టిగా నినాదాలు చేస్తూ బాణ సంచా పేల్చి వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడున్న కొందరు జనసేన కార్యకర్తలు వారిని ప్రశ్నించడంతో వారిపై దాడిచేసి పారిపోయారు. అక్కడున్న కార్యకర్తలంతా జనసేన నాయకురాలు వినుత భర్త చంద్రశేఖర్ ముందు ఆవేదన వెళ్లగక్కారు. టికెట్ రాకుండా నైరాశ్యంతో ఉన్న తమ పార్టీ కార్యాలయం ముందుకు టీడీపీ కార్యకర్తలు గంజాయి తాగేసి వచ్చి రెచ్చగొట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బలమేమిటో వారికి రుచి చూపిస్తామని, తమను తేలిగ్గా తీసుకున్న వారిని ఊరికే వదిలేది లేదని వారు తెగేసి చెప్పారు. దీంతో అక్కడ నుంచి శ్రీకాళహస్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

నిజాయితీ చాటుకున్న కల్యాణ కట్ట సిబ్బంది


భక్తుడికి బంగారు గొలుసును అప్పగిస్తున్న టీటీడీ సిబ్బంది

తిరుమల: భక్తుడు పోగొట్టుకున్న బంగారు గొలుసును తిరిగి అప్పగించి కల్యాణకట్ట సిబ్బంది గురువారం నిజాయితీని చాటుకున్నారు. ఉదయం ఓ భక్తుడు మాధవ నిలయంలో తలనీలాలు సమర్పించాడు. గుండు శుభ్రం చేసుకుంటుండగా రూ.2 లక్షల విలువ చేసే చైన్ పోగొట్టుకున్నాడు. ఎంత వెతికినా అక్కడ దొరకలేదు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కల్యాణకట్ట ప్రధాన కార్యదర్శి వంకిపురం పవన్‌కు గొలుసు దొరకడంతో టీటీడీ వీజీఓకి అప్పగించాడు. వెంటనే భక్తుడు తన గొలుసుకు సంబంధించి ఆనవాళ్లు చెప్పడంతో వీజీఓ నందకిషోర్, ఏవీఎస్ శైలేంద్ర ఆధ్వర్యంలో అతనికి అప్పగించారు. ఈ సందర్భంగా భక్తుడు ఆనందం వ్యక్తం చేస్తూ, టీటీడీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కల్యాణ కట్ట సిబ్బందిని విజీవో అభినందించారు.

శ్రీనివాసమూర్తికి ఫెలో అవార్డు


శ్రీనివాసమూర్తికి అవార్డు అందజేస్తున్న వీసీ

తిరుపతి సిటీ : ఎస్వీయూ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తికి ఫెలో అవార్డు వరించింది. గురువారం వర్సిటీ వీసీ కార్యాలయంలో వీసీ వి.శ్రీకాంత్ రెడ్డి ఆయనకు ఫెలో అవార్డును అందజేశారు. వ్యవసాయ క్షేత్ర సంబంధిత పరిశోధనలకు గాను లక్నోకు చెందిన సొసైటీ ఆఫ్ అగ్రికల్చరల్ బయోకెమిస్ట్రీ అనే సంస్థ ఫెలో అవార్డును ఆయనకు ప్రకటించింది. ఆయన గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ హుస్సేన్, డీన్ విజయభాస్కర్‌రావు, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

కనుమరుగవుతున్న మంచి లక్షణాలు

- మధ్యతరగతి కుటుంబాలు తన పాత్రను పోషించట్లేదు
- ప్రముఖ చరిత్రకారులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ


సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, వేదికపై రాఘవ శర్మ

తిరుపతి కల్చరల్: పందొమ్మిదవ శతాబ్దంలో సామాజిక మార్పు కోసం కృషిచేసిన మధ్యతరగతి వర్గం, ఇవాళ ఆ పాత్రను నిర్వహించలేకపోతోందని ప్రముఖ చరిత్రకారులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇవ్వాల మధ్యతరగతి కుటుంబాల్లో ఉండాల్సిన మంచి లక్షణాలు చాలావరకు కనుమరుగయ్యాయని తెలిపారు. 'తెలుగు సమాజం–ఆధునీకత' అనే అంశంపై తిరుపతి జిల్లా పౌరచైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో ముఖ్యవక్తగా ఆయన ప్రసంగించారు. ఆంగ్లేయుల పాలనలో ప్రవేశపెట్టిన జమిందారీ వ్యవస్థ, రైత్వారీ వ్యవస్థ అంతకు ముందున్న వ్యవస్థల కంటే కొంచెం మెరుగైనవే అయినా, బ్రిటిష్ వారు తమ ప్రయోజనాల కోసం వాటిని ఏర్పాటు చేశారని, ఆంగ్ల విద్య కూడా అలాంటిదేనని వివరించారు. ఆంగ్లేయుల పాలనలో ఎంత నష్టం జరిగిందో అంత మంచి కూడా జరిగిందన్న విషయం మరిచిపోకూడని ఆయన గుర్తు చేశారు. ఆధునిక కాలంలో నూతనంగా ఏర్పడిన మధ్యతరగతి వర్గం చాలా చరిత్రాత్మక పాత్ర నిర్వహించిందని, ఇవ్వాళ్టికి కూడా రాజకీయాల్లో, ఉద్యోగాల్లో, సమాజాన్ని శాసిస్తూనే ఉందని, నేడు ఆ పాత్రను నిర్వహించలేకపోతోందని, ఒక మేరకు అవినీతికి ఎలా అలవాటుపడిందో కూడా వకుళాభరణం వివరించారు. కుల వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థలో భాగంగా సమాజాన్ని పీడిస్తోందని అన్నారు. కులం ఉన్నంత కాలం ఈ దేశం బాగుపడదని అంబేద్కర్ అన్న విషయాన్ని గుర్తు చేశారు. అంబేద్కర్ ఒక స్వాప్నికుడని, ఆ మహానుభావుడు కేవలం దళితుల కోసం మాత్రమే పాటుపడలేదని, దళితులు సమాజంలో భాగం కనుక మొత్తం సమాజ అభ్యున్నతి కోసం పాటు పడ్డారని అన్నారు. పౌర చైతన్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షుడు వాకాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అనేక మంది వేసిన ప్రశ్నలకు వకుళాభరణం రామకృష్ణ సమాధానాలు చెప్పారు. పౌర చైతన్య వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవ శర్మ, ప్రధాన కార్యదర్శి కుమార్ రెడ్డి, కోశాధికారి హరీష్, విశ్వవిద్యాలయ అధ్యాపకులతో పాటు విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంలో అప్రమత్తత అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ రమణ, అతిథులు, శిక్షణకు హాజరైన ఔత్సాహికులు, రైతులు

తిరుపతి సిటీ: తేనెటీగల పెంపకంలో అప్రమత్తత అవసరమని, ఉత్పత్తిదారులు జాగ్రత్తలను పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ తెలిపారు. గురువారం ఆర్ఏఆర్ఎస్‌లో తేనెటీగల పెంపకంపై జరిగిన రెండురోజుల రాష్ట్రస్థాయి శిక్షణా సదస్సును ఆయన ప్రారంభించారు. తేనెటీగల పెంపకం శ్రమతో కూడుకున్నదని, మెలకువలు తెలుసుకుంటే అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. తేనె ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడితే అధిక రాబడికి అవకాశాలు ఉంటాయన్నారు. సన్నకారు వ్యాపారులతో సంధి కుదుర్చుకుంటే ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయించవచ్చన్నారు. తేనె ఉత్పత్తులతో పాటు ఉప్పాడి తేనెటీగల నుంచి వచ్చే మైనపు ఉత్పత్తులపైన దృష్టి సారించాలని సూచించారు. తేనెటీగల నిర్వహణ, ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ప్యాకింగ్ వంటి విషయాలపై పూర్తి అవగాహన పెంచుకున్న తర్వాతే తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించాలని తెలిపారు. సదస్సులో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దశరథరామిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సుధాకర్, డాక్టర్ మంజునాథ్, బాలహుస్సేన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హోరాహోరీగా టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు


క్రికెట్ పోటీల్లో పాల్గొన్న టీటీడీ ఉద్యోగులు


అధిక పరుగులు సాధించిన ఈ–టీమ్ కెప్టెన్ మస్తాన్

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం వెటర్నరీ యూనివర్సిటీ క్రీడామైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో జే టీమ్ పైన ఈ–టీమ్ 191 రన్స్‌తో గెలిపి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఈ టీమ్ కెప్టెన్ మస్తాన్ 66 బంతుల్లో 143 పరుగులు సాధించాడు. ఇప్పటివరకు జరిగిన పోటీల్లో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేశారు. అంతేకాకుండా ఇప్పటివరకు జరిగిన టోర్నీలోనే ఈ టీమ్ ఆటగాళ్లు కేవలం 15 ఓవర్లలోనే 191 పరుగులు సాధించడం గమనార్హం. అలాగే టీటీడీ పరిపాలనా భవనం వెనుక పరేడ్ మైదానంలో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

లక్ష్య సాధనే ధ్యేయంగా శ్రమించాలి


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

తిరుపతి సిటీ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని శ్రమించాలని రేణిగుంట డీఎస్పీ ఓ ఎస్.భవ్యకిషోర్ సూచించారు. గురువారం స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో పరిచయ్–24 అనే పేరుతో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డేకి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. విద్యార్థి దశ కీలకమని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు దేశ సేవే లక్ష్యాంగా అద్భుతాలు సృష్టించాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల అధినేత మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో శ్రమిస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అనంతరం అకడమిక్, క్రీడారంగలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ జయచంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ సైన్సు సదస్సుకు విద్యార్థిని వాణి



విద్యార్థిని వాణిని అభినందిస్తున్న టీచర్లు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని వాణి జాతీయ సైన్సు సదస్సుకు ఎంపికై నట్లు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సభాపతి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పలమనేరులోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కొబ్బరి బోండాలను కత్తితో కాకుండా కోకోనట్ డ్రిల్లర్, బ్రేకర్ సహాయంతో సులభంగా రంధ్రాలు చేసే పరికరం నమూనాను ప్రదర్శించడంతో జాతీయస్థాయి సదస్సుకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి సైన్సు సదస్సులో విద్యార్థిని వాణి పాల్గొననున్నట్లు వివరించారు. అనంతరం గైడ్ టీచర్ కామేశ్వరిని, విద్యార్థిని వాణిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో మోహన్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

భాకరాపేట: అక్కచెల్లెమ్మల భవితను మార్చనున్న వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం చిన్నగొట్టిగల్లులో చేపడుతున్నట్లు చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత చెక్కులు పంపిణీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నట్లు చెప్పారు. 45–60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అక్క చెల్లెమ్మలకు సంవత్సరానికి రూ.18750 చొప్పున నాలుగేళ్ల కాలంలో ఒక్కొక్కరికి రూ.75,000 ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. మండలంలోని 13 పంచాయతీల్లో నాలుగేళ్లలో 1,268 మందికి రూ.2.38 కోట్లు అందించడం జరిగిందన్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు చిన్నగొట్టిగల్లు జగనన్న సమావేశ మందిరంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ దేవేంద్రబాబు, ఏపీఎం కుమార్‌స్వామి, సంఘమిత్రలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



గురవారెడ్డి (ఫైల్)

రామచంద్రాపురం: మండలంలోని నడవలూరు గ్రామానికి చెందిన గురవారెడ్డి ఆచూకీ తెలపాలని వారి కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు గురవారెడ్డి 9వ తేదీ ఉదయం పొలం వద్దకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో వారు బంధువుల వద్దకు వెళ్లి వెతికినా ఆయన జాడ తెలియకపోవడంతో ఆచూకీ తెలపాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురవారెడ్డి ఇంటి నుంచి వెళ్లేటప్పుడు లేత పసుపు రంగు షర్టు, పచ్చ రంగు టవల్, ఖాకీ రంగు పంచె ధరించి ఉన్నాడని చెప్పారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ చిరంజీవి 9440796731 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ గణిత దినోత్సవం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌భాషా మాట్లాడుతూ గణిత శాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందించుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని తెలిపారు. గణితశాస్త్రం అధ్యాపకురాలు డాక్టర్ మాధవి మాట్లాడుతూ గణితశాస్త్ర ప్రాముఖ్యతను, పోటీ పరీక్షల్లో నెగ్గడానికి గణితశాస్త్రం ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీ రమేశ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,832 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,636 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



విశ్వబ్రాహ్మణుల సంఘం చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

సోషల్ మీడియాలో వేధింపులు దుర్మార్గం

- అందుకే గీతాంజలి బలవన్మరణానికి పాల్పడింది
- సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడే వారికి కనువిప్పు కావాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- గీతాంజలికి నివాళులు అర్పించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

చంద్రగిరి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు చాలా వరకు తన కుటుంబానికి వర్తించాయని, తన కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నెరవేరిందని తెనాలికి చెందిన గీతాంజలి సంతోషంగా చెప్పడమే ఆమె పాలిట శాపంగా మారిందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. గీతాంజలి బలవన్మరణంతో అయినా సోషల్ మీడియా వేదికగా వేధింపులకు పాల్పడే వారికి కనువిప్పు కావాలన్నారు. మంచిని ప్రచారం చేసుకునేందుకు వినియోగించాల్సిన సోషల్ మీడియాను అభంశుభం తెలియని అమాయకురాలు ప్రాణాలను తీసుకునే విధంగా ట్రోల్స్ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. గురువారం విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద గీతాంజలి మృతి పట్ల ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి సంఘీభావం అక్కడకు చేరుకున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆమె చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై, గీతాంజలి మృతికి కారకులైన రాక్షసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్నను మళ్లీ గెలిపించుకుంటామని చెప్పడమే గీతాంజలి చేసిన తప్పా ? అని ప్రశ్నించారు. ఇటీవల ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సోషల్ మీడియాలో సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారన్నారు. తనకు ఇంటి స్థలం ఇచ్చారని, ఎంతో సంతోషంగా ఉందని, అమ్మఒడి, పింఛన్, వైఎస్సార్ చేయూత వంటి మరెన్నో పథకాలు వచ్చాయని తెలిపారు. ఆమె సంతోషాన్ని చూసి ఓర్వలేని కొందరు సోషల్ మీడియాలో వికృతంగా వ్యవహరించి ఆమె బలవన్మరణానికి కారకులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రజలకు మెరుగైన పథకాలు, అభివృద్ధి, సంక్షేమం అందుతుందా ? అని పర్యవేక్షించాల్సిన ప్రతిపక్ష పార్టీలు నేడు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుండడం దురదృష్టకరమని విమర్శించారు. ఆమెపై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వీరి పైశాచిక ఆనందానికి, నిరంకుశ ధోరణికి ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోయి ఒంటరిగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెట్టిన పోస్టింగులు, ఆ ట్రోలింగ్‌లు చూసి గీతాంజలి తట్టుకోలేక విలవిల్లాడి ఉంటుందన్నారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లం చంద్రమౌళి రెడ్డి, తిరుపతి రూరల్ మండలం వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు బాలాచారి, కుమార్, నటరాజ, నాదముని, మిథిలేష్, భాను, పెద్దఎత్తున నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిని ప్రగతి పథంలో నిలిపాం



అగరాలలో గ్రావెల్‌రోడ్డును ప్రారంభిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని రూ.కోట్ల మేర నిధులతో అభివృద్ధి చేశాం .. వచ్చే ఎన్నికల్లో చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని, యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తొండవాడ, అగరాల గ్రామాల్లో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డితో కలసి ఆయన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆలయాలకు సొంత నిధులతో మైక్ సెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో చంద్రగిరి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ గెలుపుజెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

రైతుల కుటుంబాల్లో సంతోషం..

అగరాల పంచాయతీలోని సుమారు 100కు పైగా రైతుల కుటుంబాల్లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సంతోషాన్ని నింపారు. గ్రామానికి చెందిన రైతులు తమ పొలాల వద్దకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి సమస్యను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆనయ వెంటనే సుమారు రూ.10 లక్షలతో 1.5 కిలోమీటర్ల మేర గ్రావెల్‌రోడ్డును నిర్మించారు. గురువారం ఈ రోడ్డును యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా తీరని సమస్యను పరిష్కరించి, తమకు ఎంతో మేలు చేశారని స్థానిక రైతులు హర్షిత్ రెడ్డి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ కన్వీనర్ మస్తాన్, సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచులు మల్లం దీపిక, అగరాల భాస్కర్ రెడ్డి, భారతి, వైస్ ఎంపీపీ నిరంజన్, వెంకటరత్నం, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, పసల నాగరాజు, ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



తొండవాడలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు

ఆర్సీపురం..అభివృద్ధిలో ఆదర్శం



గ్రామస్తులకు ఇంటిపట్టాలను అందజేస్తున్న చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి

రామచంద్రాపురం: అభివృద్ధిలో రామచంద్రాపురం ఆదర్శంగా నిలిచిందని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనుప్పల్లి సచివాలయ పరిధిలో ప్రభుత్వం, తుడా నిధులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలసి ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.3.19 కోట్ల నిధులతో 21 అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సమావేశ మందిరాలు, గ్రంథాలయాలు, శ్మశాన వాటిక అభివృద్ధి, రచ్చబండలు, సిమెంట్ బల్లలు, యోగా మందిరాలు, ఆర్వో ప్లాంట్లు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వంటి అనేక రకాల పనులను చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నెమళ్లగుంట్లపల్లి గ్రామంలో గత కొన్నిరోజులుగా తాగునీటి ఇబ్బంది తలెత్తింది. మహిళలు పంటపొలాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తాగునీటి సమస్యను తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి నూతన బోరు వేయించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి గురువారం తాగునీటి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ గోవర్ధన్, నాయకులు శంకర్‌రెడ్డి, మోహన్, వెంకటరెడ్డి, దేవరాజురెడ్డి, బాలమురళి, రూపుందర్ రెడ్డి, దొరస్వామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాధముని, యశ్వంత్, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ధ్యానేష్‌రెడ్డి

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.లక్ష్మీశ

రామచంద్రాపురం: రీపోలింగ్, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.లక్ష్మీశ అన్నారు. గురువారం మండలంలోని వెంకట్రామాపురం, కమ్మపల్లి, కొత్తకండ్రిగ, కుప్పంబాదూరు, సీకాలేపల్లి, ఎన్ఆర్ కమ్మపల్లిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక గొప్ప ప్రక్రియ అని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా, నిష్పక్షికంగా ఎన్నికలు జరిగేలా ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు పక్కా ప్రణాళికతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తగినంత పోలీసు బందోబస్తుతో ఎన్నికలు ప్రశాంతగా జరపాలని సూచించారు. హింసాత్మక ఘటనలు, రీపోలింగ్‌కు తావు లేకుండా కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్ ఏర్పాటు, వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర ఏర్పాట్లతో పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఏఈఆర్వోలు, సెక్టోరియల్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ర్యాంపు, తాగునీరు, మరుగుదొడ్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ ఉషారాణి, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పాడిపేట యువతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పాడిపేట.. వైఎస్సార్‌సీపీకి కంచుకోట

- తిరిగి సొంత గూటికి చేరిన దళితవాడ యువత
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో చేరిక



పాడిపేట నుంచి తుమ్మలగుంటకు ర్యాలీగా వస్తున్న యువత

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీకి పాడిపేట పంచాయతీ కంచుకోట వంటిదని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. పాడిపేట మాజీ ఎంపీటీసీ తిరుమలయ్య ఆధ్వర్యంలో దళితవాడకు చెందిన వెంకటముని, నవీన్, వాసు, మునిరత్నం, ముని, మధు, మల్లికార్జున, మరికొందరు యువత గురువారం సొంత గూటికి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇటీవల టీడీపీ నేతలు వారికి బలవంతంగా వారి పార్టీ జెండాలను కప్పి మభ్యపెట్టారు. రెండురోజుల్లోనే వారు టీడీపీ కండువాలను విసిరికొట్టి మోహిత్‌రెడ్డి నాయకత్వానికి జైకొట్టారు. తుమ్మలగుంటలో వారికి పార్టీ కండువాలను కప్పి మోహిత్ రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వందలాదిగా తరలివచ్చిన గ్రామస్తులతో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ పాడిపేట పంచాయతీ తమకు సొంతగ్రామం వంటిదన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి అండగా భారీ మెజారిటీని అందించే ఈ గ్రామం అంటే తమకు ఎంతగానో అభిమానం అని చెప్పారు. ఇప్పటికే గ్రామంలో రూ.5 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఉమ్మడి కుటుంబం వంటి గ్రామస్తుల మధ్య చిచ్చుపెట్టాలని కొన్ని పార్టీలు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు.

భారీ ర్యాలీగా..

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు మాజీ ఎంపీటీసీ తిరుమలయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీ బైక్ ర్యాలీగా పాడిపేట నుంచి తుమ్మలగుంటకు తరలివచ్చారు. వందకు పైగా బైక్‌లు, నాలుగు కార్లు, ఐదు ఆటోలతో గ్రామస్తులు తుమ్మలగుంటకు వచ్చి మోహిత్‌రెడ్డికి మద్దతు తెలిపారు. గ్రామం మొత్తం చెవిరెడ్డి కుటుంబం వెంటే ఉంటుందని నినదించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



చంద్రగిరి: ఎన్నికలపై సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్



పాకాల: పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలకు సూచనలు చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

- ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

చంద్రగిరి: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ అన్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లోని సిబ్బంది పనితీరు, పోలీసు స్టేషన్‌లో ఉన్న వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇప్పటికే చంద్రగిరికి సంబంధించి పలు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, త్వరలోనే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. పోలీసు రికార్డుల్లో ఉన్న రౌడీషీటర్లు, డెకాయిట్లు, నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి, నిరంతరం వారి కదలికలపై నిఘానేంత్రంలో పర్యవేక్షించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పనితీరును ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శరత్ రాజ్ కుమార్, ఎస్‌బీ డీఎస్పీ భాస్కర్ రెడ్డి, సీఐ రామయ్య, ఎస్‌బీ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు అనిత, రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. బైండోవర్ కేసుల్లో ఉన్న వారితో పాటు, అల్లర్లకు పాల్పడే వారిని కూడా ముందస్తుగా గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. వివిధ పార్టీల్లోని నాయకులను పిలిపించి పార్టీల్లోని విభేదాలతో గొడవలు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శరత్‌కుమార్ రాజ్, పాకాల సీఐ రాజగోపాల్, ఎస్ఐ మహేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హెచ్ఎం సుజనకుమారి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు